ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

గురువారం 3 ఏప్రిల్ 2025



ఇంకా అద్దె ఇళ్లేనా?!

- జిల్లాలో అరకొర సౌకర్యాల మధ్య ప్రభుత్వ కార్యాలయాలు
- సొంత భవనం లేని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు
- అద్దె ఇళ్లలోనే కార్యకలాపాలు
- ఆదాయం భారీగా వస్తున్నా ఆదరించని ప్రభుత్వం
- కిరాయి సైతం కట్టని పరిస్థితి..
- తాళం వేసేందుకు సిద్ధమవుతున్న యజమాని!



మంజూర్‌నగర్‌లోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యాలను విస్తృత పరుస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు.. అందుకు తగ్గ సౌకర్యాలను సమకూర్చడం లేదు. గ్రామీణ ప్రజలకు సైతం పౌర సేవలను అందుబాటులోకి తెస్తున్నామని డంకా బజాయిస్తూ చెప్పుకుంటున్నా అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొత్త జిల్లాగా ఆవిర్భవించిన భూపాలపల్లిలో ఇంకా అనేక కార్యాలయాలు అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమస్యల వలయంలో విలవిలాడుతోంది.

ప్రభుత్వానికి ఆదాయం సమకురుస్తున్న కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. కార్యాలయాల ఏర్పాటుపై దృష్టి పెట్టిన ప్రభుత్వాలు, సొంత భవనాలు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

2023లో ఎంతో ఆర్భాటంగా జిల్లాలో ఏర్పాటుచేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి కూడా అంతే. సొంత భవనంలేక అద్దె భవనంలోనే ఇంకా ఇది కొనసాగుతోంది. పైగా ఇప్పటి వరకూ దాని అద్దె కూడా చెల్లించిన దాఖలాలు లేవు. దీంతో భవన యాజమాని ఆఫీస్‌కు తాళం వేసేందుకు సిద్ధమతున్నట్లు సమాచారం.

ఆరంభ శూరత్వమే..

జిల్లాగా ఆవిర్భవించిన జయశంకర్ భూపాలపల్లిలో కొద్ది రోజులోనే అన్ని ప్రభుత్వ శాఖల సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2016లో జిల్లా ఏర్పాటు తర్వాత మంజూరునగర్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో కలెక్టరేట్ ఏర్పాటైంది. దీంతోపాటు చాలా కార్యాలయాలూ కొలువుదీరాయి. కొన్నింటిని భూపాలపల్లి పట్టణంలోని ప్రతిపాదిత ఐటీఐ కాలేజీ భవన ప్రాంగణంలో, మరికొన్నింటిని పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలోని భవనంలో ఏర్పాటు చేశారు. 2023 జూలైలో మంజూర్‌నగర్‌లోని కలెక్టరేట్ ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్, అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో నూతన సమీకృత కార్యాలయం అందుబాటులోకి రావడంతో అన్ని శాఖలనూ అందులోకి తరలించా రు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మాత్రం భవన కేటాయింపు జరగలేదు. దీంతో దానిని మంజూర్‌గన ర్‌లోని ప్రైవేటు భవనంలోకి తరలించారు.

ప్రభుత్వానికి దండిగా ఆదాయం

భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూపాలపల్లి కార్యాలయం నుంచే దండిగా ఆదాయం వస్తోంది. ప్రతినెల 250 నుంచి 300 వరకు రిజిస్ట్రేషన్లు ఇక్కడ జరుగుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 14.36 కోట్ల ఆదాయం సమకూరింది. 2024-25 లో రూ. 15 కోట్లకుపైగా ఆదాయాన్ని ఈ కార్యాలయం ప్రభుత్వానికి అందించింది. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఈ ఆఫీసుకు రూ. 10లక్షల ఆదాయం సమకూరింది. ప్రభుత్వానికి ఇంత ఆదా యం సమకూరుస్తున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనంలేక ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతాం

- రాహుల్‌శర్మ, భూపాలపల్లి కలెక్టర్




అద్దె భవనంలో నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతాం. సొంత భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

19 నెలలుగా అద్దె చెల్లింపుల్లేవ్

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూపాలపల్లి జిల్లాకు తీసుకొచ్చిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇప్పటి వరకు సొంత భవనం కేటాయింపులు జరగలేదు. మంజూర్‌గనర్‌లో నిర్వహిస్తున్న కార్యాలయానికి దాదాపు 19నెలలుగా అద్దె చెల్లించలేదన్నట్లు సమాచారం. ప్రతి నెల రూ. 17,500 అద్దెను భవన యాజమానికి చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ. 3,32,500 ప్రభుత్వం బాకీ పడింది. 19 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా యాజమానికి రూపాయి చెల్లించిన దాఖలాలు లేవు. దీంతో యాజమాని కార్యాలయానికి తాళం వేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దీనికి తోడు రిజిస్ట్రేషన్ల కోసం వస్తున్న ప్రజలకు పార్కింగ్ సమస్య కూడా తీవ్రంగా వేధిస్తోంది. తరుచూ చుట్టుపక్కల నివాసం ఉండే వారితో గొడవలు జరుగుతున్నాయి. అద్దె భవనంతోపాటు కార్యాలయంలో సిబ్బంది సమస్య కూడా ఉంది. కార్యాలయానికి ఒక సబ్ రిజిస్ట్రార్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగి. మొత్తం ఆరుగురు ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా నలుగురు ఉద్యోగులు డిప్యూటేషన్ పనిచేస్తున్న వారే. మరోవైపు మరిన్ని సమస్యలు ఇక్కడ వేధిస్తున్నాయి. విద్యుత్ పోతే రిజిస్ట్రేషన్లు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఇన్వర్టర్ సౌకర్యం లేకపోవడంతో విద్యుత్ పోతే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలకొన్న సమస్యలకు సొంత భవనంతోనే పరిష్కరం లభించే అవకాశం ఉందని సిబ్బంది అంటున్నారు.

వేతన.. వెతలు!



- ఏడాదిగా జీతాల్లేక ధరణి ఆపరేటర్ల పస్తులు
- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపు ప్రతిపాదన
- ఆదేశాలు రాక వేతనాలు ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 78మంది ఆపరేటర్లు.. రూ.కోటికి పైగా బకాయి
- బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం

వివరాలు 7వ పేజీలో

రజతోత్సవ సభతో రాజకీయాల్లో పెను మార్పులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో సభ నిర్వహణ పనుల ప్రారంభం
- హాజరైన ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు

7



ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహణకు భూమి పూజ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జోరుగా ఇసుక దందా



వాగు వద్ద ఇసుక తరలించిన ఆనవాలు

మహాముత్తారం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మారుగూల గ్రామాల అడవులలోని వాగుల నుంచి ఇసుకను కొంత మంది అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. యత్నారం-నిమ్మగూడెం గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుకు కొద్ది దూరంలో ఉన్న చిట్యాల వాగు నుంచి నిత్యం రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. తారు రోడ్డు నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న వాగుకు నిత్యం ట్రాక్టర్లు నడవడంతో అక్కడా ఓ దారి ఏర్పడింది. దాని మీదుగా ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. కొంత మంది ముఠాగా ఏర్పడి అడవిలోంచి ఇసుకను తరలిస్తూ ట్రిప్పునకు రూ. 3వేల చొప్పున దండుకుంటున్నట్టు తెలుస్తోంది. ఫారెస్టు అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దందా జోరుగా సాగుతోంది. దీనిపై భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని వివరణ కోరగా ఆ ప్రదేశానికి తమ సిబ్బందిని పంపించి విచారణ చేపట్టి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

వాహనం బోల్తా

- పది మంది కూలీలకు గాయాలు
- క్షతగ్రాతులు మధ్యప్రదేశ్‌కు చెందిన వారు
- కొత్తగూడెం వెళ్లి వస్తుండగా ఘటన





చికిత్స పొందుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కూలీలతో ఇంటికి వెళ్తున్న వాహనం బోల్తా పడింది. భూపాలపల్లి మండలం కమలాపూర్ శివారు గట్టమ్మ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు సుమారు 10 మంది భద్రాద్రి కొత్తగూడెంలో మిర్చి ఏరేందుకు కొద్ది రోజుల క్రితం వెళ్లారు. వారంతా ఓ వాహనంలో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. కాళేశ్వరం మీదుగా వెళ్లేందుకు బయల్దేరగా మార్గమధ్యలో భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ గట్టమ్మ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న పది మందిలో జయంత్‌లాల్, కుందుబాయ్, రమోతిబాయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఏడుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. అటువైపు వెళ్తున్న ఇతర వాహనదారులు ఇది గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రులను వంద పడకల ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి పోలీసులు పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల వివరాలను సేకరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత



జిల్లా కేంద్రంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో వస్తువులు పరిశీలిస్తున్న శ్రీలత

కృష్ణకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పలు కిరాణషాపులు, సూపర్‌మార్కెట్లు, హోంనీడ్స్, బియ్యం షా ప్స్ చిప్స్ విక్రయ దుకా ణాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. మొత్తం గా 15 దుకాణాలను తని ఖీ చేసి, నిబంధనలు అతిక్రమించిన ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. విక్రయించే వస్తువులపై ఎమ్మార్పీ లేకపోవడం, ప్రొడక్ట్ పేరు లేకపోవడాన్ని గుర్తించారు. దీంతోపాటు కాలం చెల్లిన ఉత్పత్తుల ను విక్రయిస్తున్నట్లు తేలడం తో కేసులు నమోదు చేశారు. ఆమె వెంట హెడ్‌కానిస్టేబుల్ హఫీజ్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పేపరు రాసిన విద్యార్థులు పరీక్షలు పూర్తయ్యాయనే సంబురంతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. చివరి రోజు 3449 మంది విద్యార్థుల్లో 3,442 మంది పరీక్ష రాశారు. ఏడుగురు గైర్హాజరయ్యారని డీఈవో రాజేందర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా సాగేలా సహకరించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి, అన్ని శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- సన్న బియ్యం పంపిణీ చారిత్రక నిర్ణయం
- ప్రజాప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ములుగులో మహిళలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన ప్రజాప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్ర మాన్ని బుధవారం ములుగు జిల్లాలో ప్రారంభించారు. తొలుత మల్లంపల్లి మండల కేంద్రంలో బియ్య పంపిణీకి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. జిల్లాకేంద్రంలో బియ్యం పంపిణీని ప్రారంభించి పలువురికి కల్యాణలక్ష్మి చెక్కు లను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల కొత్త తెల్లరేషన్ కార్డులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీని చేపట్టామని తెలిపారు. ఇది దేశ చరిత్రలోనే చారిత్రక నిర్ణయమన్నారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఆహారభద్రత చటాన్ని అమలులోకి తెచ్చింద ని గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో కేవలం మూడుకోట్ల ఎకరాలలో మాత్రమే వరి సాగవ్వగా తిండి కోసం పేదలు అల్లాడిపోయారని, ఆనాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ గరీబి హఠావో నినాదంతో సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించి రికార్డు స్థాయిలో వరి సాగు చేయించారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో రేవంత్ సర్కారు పాలన సాగి స్తోందన్నారు. తెలంగాణలో పండిన ధాన్యం ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్‌ను బాకీ లేకుండా ఇచ్చామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలిస్తూనే పాత వడ్డీలను చెల్లించడం జరిగిందన్నారు. యేటా 5లక్షల ఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తున్నామని, తొలుత నిరుపేదలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యంతో వండిన అన్నాన్ని ప్రజలు తినలేకపోయారని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, అదనపు కలెకర్ సి.హెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, డీసీఎస్‌వో షాఫైజల్ హుస్సేని, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం రాంపతి, తహసీల్దార్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. జంగాలపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభిం చారు.

మహనీయుడు సర్వాయి పాపన్న

స్వాతంత్ర్యం, పేదల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్నగౌడ్ అని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. పాపన్న 315వ వర్ధంతి ములుగులోని సంక్షేమ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమయోధులు, మహనీయులను ఆశ య ఎ

సాధనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, బీసీలకు రాజకీయం, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడంతోపాటు ఢిల్లీలో ధర్నా చేసి కేంద్రంపై

మిగతా 8వ పేజీలో...

బహుజన వీరుడు.. సర్వాయి పాపన్న

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ్ కులస్థుల హక్కుల కోసమే కాకుండా అనేక సామాజిక రుగ్మతలపై పోరాడారని కొనియాడారు. కుల, మత, జాతి విభేదాలు లేకుండా సమసమాజ నిర్మాణ స్థాపన కోసం పోరాటం చేసిన గొప యోధుడు సర్దార్ పాపన్న అన్నారు. సర్వాయి పాపన్న 17వ శతాబ్దంలో బహుజన రాజుగా చరిత్రలో నిలిచారన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో సన్నవడ్లు దిగుమతి చేసుకోలేం..

- క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వలేం..
- మంత్రి సీతక్కకు మిల్లర్ల వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న రైస్‌మిల్లర్లు

ములుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం పథకం రైస్‌మిల్లర్ల మెడకు చుట్టుకుంది. క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం నిబంధనతో తాము నష్టపోతున్నామని, ఈసారి యాసంగిలో వడ్లను దిగుమతి చేసుకోలేమని వారు అంటున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడం, పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం గొప్ప విషయమని అన్నారు. కానీ, నిబంధన ప్రకారం ప్రభుత్వం సేకరించిన క్వింటా వడ్లకు రైస్‌మిల్లులో మరాడించి 67 శాతం బియ్యం ఇవ్వడం ఏ విధంగానూ సాధ్యపడదని ప్రవీణ్ తెలిపారు. ప్రభుత్వానికి సహకరించాలనే ఉద్దేశంతో ఈ సీజన్‌లో నష్టాలను కూడా ఓర్చుకున్నామని, కానీ యాసంగిలో అధిక ఉష్ణోగ్రతతో వడ్లు మరాడించే సమయంలో విరిగిపోయే అవకాశం ఉండటంతో 67శాతం బియ్యం రావని తెలిపారు. బాయిల్డ్ చేస్తేనే ఆశించిన స్థాయిలో బియ్యం వస్తాయని పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వం రా రైస్ మాత్రమే ఇవ్వాలని ఒత్తిడి తెస్తోందని, బలవంతంగా వడ్లను మిల్లులకు కేటాయిస్తే రైస్ మిల్లుల వ్యవస్థ నష్టాలతో కుప్పకూలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల బెడద ఉన్నందున వడ్లను నిల్వ చేసేందుకు ప్రత్యామ్నాయంగా గోదాములను ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీతక్క, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురిజాల సహోదర్‌రెడ్డి, ట్రెజరర్ ఎలగందుల మోహన్, కొమురవెల్లి హరినాథ్ తదితరులు ఉన్నారు.

చిన్నకాళేశ్వరం కెనాల్‌కు ఎంజాయ్‌మెంట్ సర్వే



లక్ష్మీపూర్ శివారులో ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తున్న అధికారులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సూరారం పరిధిలో ఉన్న లక్ష్మీపూర్, రాపల్లికోట శివార్లలో చిన్నకాళేశ్వరం మెయిన్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కోసం రెవెన్యూ అధికారులు బుధవారం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. రెండు శివార్లలో కెనాల్ ప్రతిపాదిత భూముల వివరాలు, సర్వే నెంబర్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈసర్వేలో సర్వేయర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుపెక్కిన కడవెండి

- మావోయిస్టు నేత రేణుక అలియాస్ చైతుకు కన్నీటి వీడ్కోలు
- అంతిమయాత్రకు భారీగా హాజరైన జనం
- స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు
- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలంటూ విప్లవకారుల డిమాండ్



కడవెండిలో రేణుక భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, తదితరులు

దేవరుప్పుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు గుమ్మడివెల్లి రేణుక అలియాస్ చైతు అలియాస్ భాను అలియాస్ సరస్వతి అంత్యక్రియలు బుధవారం ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండిలో పూర్తయ్యాయి. ఈ అంతిమయాత్రకు భారీగా పలు విప్లవ సంఘాలు, పార్టీల నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరవడంతో కడవెండి గ్రామం మరోసారి ఎరుపెక్కింది. 1999లో కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్ అంత్యక్రియల సందర్భంగా గ్రామమంతా ఎర్రజెండాలతో ఎరుపెక్కగా.. మళ్లీ ఇన్నేళ్లకు రేణుక అంత్యక్రియల సందర్భంగా మరోసారి ఎరుపెక్కింది. మంగళవారం దంతెవాడ నుంచి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని బయల్దేరిన కుటుంబసభ్యులు అర్ధరాత్రి దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రేణుక పెదనాన్న లక్ష్మీనర్సు, తండ్రి సోమయ్య, సోదరులు జీవీకే ప్రసాద్, రాజశేఖర్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు, బంధుమిత్రులంతా నివాళులర్పించారు. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, నవ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకులు గాదె ఇన్నయ్య, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ మాజీ సభ్యులు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నేత సీహెచ్ రాజారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, గద్దర్ కుమారుడు సూర్యం, వెన్నెల, రెడ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌కన్నా, పౌరహక్కుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ప్రముఖ కవి, రచయిత జ్వాలాముఖి, అమరుల బంధుమిత్రుల సంఘం ప్రతినిధులు పద్మకుమారి, అంజమ్మ, లక్ష్మీ, శ్రీకాంతాచారి తండ్రి వెంకటాచారి, పీపుల్స్ వార్, మావోయిస్టు మాజీ నేతలు రేణుక మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రేణుక పెదనాన్న లక్ష్మీనర్సు ఇంటి నుంచి రేణుక మృతదేహంతో ప్రారంభమైన అంతిమయాత్ర సాయంత్రం 4గంటల వరకు సాగింది. గ్రామస్థుల డప్పుచప్పుళ్లు, కోలాటం, విప్లవకారులు, ప్రజా సంఘాల నాయకుల ఆటపాటలతో గ్రామం మారుమోగింది. రేణుక అంత్యక్రియలకు సుమారు 3వేల నుంచి 4వేల మంది హాజరైనట్టు అంచనా. గ్రామ శివారులోని వాగు వద్ద రేణుక అంత్యక్రియలు జరుపగా ఆమె సోదరుడు జీవీకే ప్రసాద్ అలియాస్ ఉసెండి రేణుక చితికి నిప్పంటించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. తల్లుల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, సుమారు 5వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

మే 4లోగా సరస్వతీ పుష్కరాల పనులు పూర్తిచేయాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

మహదేవపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 4లోగా సరస్వతీ పుష్కరాల పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. హైదరాబాద్‌లోని చేనేత భవన్‌లో ఎండోమెంట్, ఇరిగేషన్ అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. సరస్వతీ పుష్కరాల అభివృద్ధిలో ఇప్పటి వరకు ఆశించినంత పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పుష్కరాల సమయం దగ్గర పడుతోందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంత నెమ్మదిగా పనులు చేస్తే సకాలంలో పూర్తికావని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయం చుట్టుపక్కల సీసీరోడ్డు ఫ్లోరింగ్‌తో పాటు పలు అభివృద్ధి పనులు అధికారులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ఆలయ ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులో బియ్యం తక్కువ తూకం

- గ్రామస్తుల ఆందోళనతో అధికారుల విచారణ

కేసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని ధన్నసరిలో బుధవారం ఓ రేషన్ డీలర్ వద్ద బియ్యం తూకం తక్కువగా వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు రేషన్ షాపులో తీసుకువెళ్లిన బియ్యాన్ని బయట తూకం వేయగా కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువగా వచ్చాయని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంఆర్ఐ చెరుకు బాబు విచారణ జరిపారు. అనంతరం ఎంఆర్ఐ మాట్లాడుతూ రేషన్ షాపులోని ఎలక్ట్రికల్ కాంటాను పరిశీలించగా కిలోన్నర నుంచి రెండు కిలోల తూకం తేడా వచ్చిందని తెలిపారు. ఈ కాంటాలను సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. డీలరుపై చర్యలు తీసుకునేందుకు తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వివరించారు.

యశ్వంత్‌ను ప్రశంసించిన బిహార్ గవర్నర్



గవర్నర్‌కు పర్వతారోహణ బుక్‌లెట్‌ను అందిస్తున్న మౌంటెనర్ యశ్వంత్

మరిపెడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన మౌంటెనర్ భూక్యా యశ్వంత్‌ను బిహార్ గవర్నర్ ఆరిఫ్‌మహ్మద్‌ఖాన్ అభినందించారు. బుధవారం ఆ రాష్ట్ర రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను యశ్వంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యశ్వంత్ దిగ్విజయంగా పూర్తి చేసిన వివిధ పర్వతారోహణల గురించి గవర్నర్‌కు వివరించి ఆ బుక్‌లెట్‌ను అందచేశారు. లక్ష్యం వైపు అడుగులు వేస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గవర్నర్ ఆకాంక్షిస్తూ తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పినట్లు యశ్వంత్ స్థానికవిలేకరులకు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

వెంకటాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ములుగు జిల్లా వెంకటాపురం పోలీసులు తెలిపారు. మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన రైతు వద్దకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కూలీలు పనుల కోసం కుటుంబాలతో కలిసి వచ్చారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బాలిక తాగునీటి కోసం బోరు వద్దకు వెళ్లగా అదే గ్రామానికి ఓ ప్రధాన పార్టీ నాయకుడు ఆమెకు మాయమాటలు చెప్పి తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. ఇది గమనించిన బాలిక వాహనంపై నుంచి దూకి రైతు ఇంటి వద్దకు చేరుకుందని పోలీసులు తెలిపారు. బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆ వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లుపోలీసులు వివరించారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

- మానుకోట జిల్లా కేంద్రంలో నేడు, రేపు నిర్వహణ
- హాజరుకానున్న 560 మంది టీచర్లు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



శిక్షణ ఇవ్వనున్న మానుకోట మోడల్ స్కూల్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 560 మంది ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లుగా పదోన్నతి పొందారు. వీరికి ఆయా స్థాయిల్లో రిసోర్సు పర్సన్‌ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 89, మోడల్ స్కూల్‌లో 471 మంది మొత్తం 560 మందికి శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ అంశాలపై..

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల పెంపు, పాఠశాలల నిర్వహణ, పరిపాలన, అకాడమిక్, మధ్యాహ్న భోజనం నిర్వహణ మొదలగు అంశాలపై రిసోర్సు పర్సన్‌లురెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాల వినియోగం, తరగతి గదిలో విద్యార్థులకు బోధన, నేర్పించడం, ప్రాక్టీస్, ఐసీటీ పరికరాలు, అకాడమిక్ స్టాండర్డ్ అభ్యసన సామర్థ్యాలు, వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, యూనిట్, ఎస్ఏ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు టీ, స్నాక్స్‌తో పాటు భోజన వసతి కల్పించనున్నారు.

560 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లాలో 2024 విద్యాసంవత్సరంలో వివిధ కేటగిరీల్లో పదోన్నతిపై 560 మంది ఉపాధ్యాయులు కొత్తగా బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు-60, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు-72, స్కూల్ అసిస్టెంట్ తెలుగు-130, హిందీ-118, ఇంగ్లీష్-20, గణితం-24, ఫిజికల్ సైన్స్-6, బయోలాజికల్ సైన్స్-48, సాంఘీక శాస్త్రం-51, పీఈ-48, స్పెషల్ ఎడ్యుకేషన్-6, బయోసైన్స్-1, ఉర్దు-1, సాంఘీక శాస్త్రం ఉర్దు-1 మొత్తం 560 మంది శిక్షణకు హాజరుకానున్నారు.

ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కావాలి

ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో, మహబూబాబాద్



జిల్లాలో వివిధ కేటగిరీల్లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు రెండు రోజులు నిర్వహించే శిక్షణకు హాజరు కావాలి. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు నిర్వహించాల్సిన విధులపై శిక్షణ ఇవ్వడం వలన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు దోహదపడుతుంది. పదోన్నతి పొందిన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణకు నిర్ణీత సమయానికి హాజరై రిసోర్సు పర్సన్‌లు చెప్పిన అంశాలను నేర్చుకోవాలి.

శిక్షణకు ఏర్పాట్లు పూర్తి

ఆజాద్‌చంద్రశేఖర్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్, మహబూబాబాద్



జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకిచ్చే శిక్షణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా 560 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా జిల్లా కేంద్రంలో రెండు రోజులు రిసోర్సు పర్సన్‌ల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాం. ఉపాధ్యాయులు సకాలంలో హాజరై శిక్షణను విజయవంతం చేయాలి.

ఆరు నెలల్లోగా పింఛన్లు పెంచి ఇస్తాం

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రేంవత్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన పెన్షన్ల పెంపు ప్రక్రియను ఆరు నెలల్లోపే పెంచుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన మండలంలోని పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, రేపోణి, దాట్ల గ్రామాల్లో ఏప్రిల్ మాసం నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కార్యక్రమాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు 10 ఏళ్లలో భారీ స్థాయిలో అవినీతికి పాల్పడి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉచిత బస్సు, ఐదు వందలకే గ్యాస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, తెల్ల రేషన్‌కార్డును ఇచ్చిందన్నారు. త్వరలో అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుందన్నారు. గ్రామాల్లో దళారి వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతామన్నారు.

మండలంలో నేటికి వందల కోట్ల రూపాయల అభివృద్ధి చేశామని విప్ రాంచంద్రునాయక్ తెలిపారు. ఎస్సారెస్పీ జలాలతో పాలేరు వాగుల్లోని చెక్ డ్యాంను నింపామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు జలకళ సంతరించుకున్నాయన్నారు. మండలంలోని పెద్దముప్పారం, దాట్ల, తదితర గ్రామాల్లో సవస్యల పరిష్కారానికి అధికారులతో సమావేశం కానున్నామన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రేపోణిలో ఇరిగేషన్ డీఈపై ఫోన్లో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ బట్టునాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాము గౌడ్, తాజా మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, మాజీ ఎంపీటీసీ సతీష్, నాయకులు పొన్నేటి బాలాజీ, కొత్త మురళి, ఏడీఈ చలపతిరావు, డీఎస్‌వో వేణుకుమార్, మండల ప్రత్యేక అధికారి వీరన్న, మిషన్ భగీరథ అధికారులు, పీఆర్ ఏఈ, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని దాట్లలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

పెద్దముప్పారం అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా..

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో తాను గెలిచిన నాటి నుంచి నేటికి వరకు జరిగిన అభివద్ధేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచం ద్రునాయక్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో చేసింది శూన్యమన్నారు. ఇప్పటికైనా పెద్దముప్పారం బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిపై చర్చకు వస్తామంటే తానే గ్రామంలోని బొడ్రాయి వద్దకు నేరుగా వస్తానన్నారు. గ్రామానికి ఎన్నో సంక్షేమ పథకాలు అందించానన్నారు. త్వరలో సాగు నీటి, తాగునీటి తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్నలు

మార్కెట్‌కు భారీగా మొక్కజొన్నల రాక

కేసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 10వేల బస్తాల మొక్కజొన్నలు విక్రయానికి రైతులు తీసుకువచ్చారు. గత నెలలో మొక్కజొన్న సీజన్ ప్రారంభంకాగా తాజాగా అత్యధికంగా 156 మంది రైతులు 10,516 బస్తాల్లో 6309 క్వింటాళ్ల సరుకు తీసుకురావడం రావడం గమనార్హం. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2224, కనిష్ఠంగా రూ.2071, సగటున రూ.2162 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి



కేసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ బుధవారం తెలిపారు. మృతునికి సుమారు 60 ఏళ్లు ఉంటాయని, మెరూన్‌కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్ మార్చురీకి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2187	1521
పల్లికాయ (సూక)	5900	5200
పల్లికాయ (పచ్చిది)	4850	4575
కందులు	6605	3022
పెసళ్లు	7851	3022
పత్తి	7150	5300
పసుపు (కాడి)	12359	10534
పసుపు (గోల)	11359	9700
తేజ మిర్చి	12800	9500
డిడి	-	-
వండర్‌హాట్	13000	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దేశీ	28000	18000
సింగిల్‌పట్టి	28011	20000
దీపిక	13000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం



రత్నగిరి గ్రామంలోని తాటి చెట్లు

పిల్లలను చదివించడం భారంగా మారింది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. నా భర్త వంగ రమేష్ ఆరు సంవత్సరాల క్రితం గీత వృత్తి చేస్తూ తాటి చెట్టుపై నుంచి పడి మరణించాడు. ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించిన అవి అప్పులకు, ఇతర ఖర్చులకే సరి పోయాయి. ప్రభుత్వం మాలాంటి వారికి ఉపాధి కోసం ఏమైన పథకాలు ప్రవేశపెట్టాలి. నా బిడ్డలను చదివించేందుకు కూలీ పనులు చేస్తున్నా.

- వంగ రమ, మరణించిన గీత కార్మికుడి భార్య, రత్నగిరి

గౌడన్నల ప్రాణాలు..
గాలిలో దీపాలు!

గీత వృత్తిలో నిలిచి ప్రమాదాల బారిన పడుతున్న వారెందరో..



గట్లనర్సింగాపూర్‌లో మరణించిన గీత కార్మికుడు కొక్కిస రాజు (ఫైల్)

- హనుమకొండ జిల్లాలో మూడేళ్లలో 15మంది మృతి, 25మందికి వైకల్యం
- కాలం కలిసి రాక కూలీలుగా మారుతున్న గౌడన్నలు
- ప్రభుత్వమిచ్చే ఎక్స్‌గ్రేషియా ఎటూ చాలడం లేదని ఆవేదన
- రూ.10లక్షల పరిహారం ప్రకటన.. హామీలకే పరిమితం

భీమదేవరపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం చేస్తున్న గీత వృత్తి గౌడన్నల పాలిట శాపంగా మారింది. గౌడన్నల బతుకులు గాలిలో దీపంలా మారాయి. ఉదయం బతుకుదెరువు కోసం తాటిచెట్లు ఎక్కేందుకు వెళ్తున్న గౌడన్నలు తిరిగి ఇంటికి వస్తారో లేరోనన్న ఆందోళన ఆ కుటుంబ సభ్యులను వెంటాడుతోంది. ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనన్న భయం.. భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి ఆ ఇల్లాలి రోదనలు.. మూడు పదుల వయసులోనే వైదవ్యం పొందుతున్న అతివలు.. శాశ్వత అంగ వైకల్యంతో బాధపడుతున్న కార్మికులు ఇలా ఎన్నో సవాళ్లు, సమస్యలు, భయాల మధ్య గీతన్నలు జంకుతున్నారు. తమ వృత్తికి రాంరాం పలికి కూలీలుగా మారుతున్నారు. కుటుంబ సభ్యులకు పట్టెడు అన్నం పెట్టేందుకు బతుకు పోరాటం చేస్తున్న గౌడన్నలు వృత్తి కలిసి రాక కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. చనిపోయిన గౌడన్నకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఎన్నాళ్లకు వస్తుందో తెలియని దుస్థితి ఉండగా.. ఆ పరిహారాన్ని రూ.10లక్షలకు పెంచుతామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయింది. వడ కల్లు, పొద్దాడు, పరుపుతాడు, పండుతాడు, కర్ర కల్లు ఇలా రకరకాల సీజన్లలో దొరికే తాటి చెట్ల కల్లు కల్లు ప్రియులకు విందులు చేస్తున్నాయి. పొద్దాడు సమయంలో అర్ధరాత్రి వరకు కల్లు నీర, వడ కల్లును కల్లు ప్రియులు ఆస్వాదిస్తుంటారు. కానీ పంటి దిగువన బాధను భరిస్తూ కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్న బాధను భరించుకుంటూ గౌడన్నలు గీత వృత్తిని చేస్తున్నారు. గాలి వచ్చిన, దుమారం కలకలం రేపినా.. వర్షం పడ్డా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తాటి చెట్లను గీస్తూ జీవనం గడుపుతున్న గీతన్నలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న బతుకు పోరాటంలో గౌడన్నలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. మూడు సంవత్సరాల్లో 15మంది గౌడన్నలు వృత్తిలో భాగంగా చనిపోయారు. వీరికి రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రూ. 50 లక్షలు చెల్లించారు. మరో రూ. 25లక్షలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అలాగే 25మంది వైకల్యం పొందినట్టు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. వీరికి రూ.70లక్షలువచ్చినా మరికొంత నిధులు రావాల్సి ఉంది. ఆ డబ్బుల కోసం వైకల్యం పొందిన గౌడన్నలు ఎదురు చూస్తున్నారు. మరణించిన గౌడన్నకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా సరిపోవడం లేదని గతంలో కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వస్తే దీనిని రూ.10లక్షల వరకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గీతన్నలు వృత్తి కలిసి రాక చనిపోతుండడంతో పలువురు గీతన్నలు గౌడ వృత్తిని వదిలేసి కూలీలుగా మారిపోతున్నారు.

కొందరికే కాటమయ్య కిట్లు..

గీతకార్మికులు చెట్లు ఎక్కిన సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురవకుండా ఉండేలా రక్షణ కిట్లను ఇచ్చింది. కాటమయ్య కిట్ల పేరుతో వాటిని పంపిణీ చేస్తోంది. కానీ ఉమ్మడి జిల్లాలో అవి పూర్తిస్థాయిలో అందలేని, కొందరికి మాత్రమే వచ్చాయని తెలుస్తోంది. పూర్తి స్థాయిలో కాటమయ్య కిట్లు అందజేయాలని గౌడన్నలు కోరుతున్నారు. కాటమయ్య కిట్ల ద్వారా చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చని భావిస్తున్న ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అందజేయాలని కోరుతున్నారు.



తాటి చెట్టు ఎక్కుతున్న గీత కార్మికులు

రూ. 10లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలి



గీత వృత్తి చేస్తూ మరణించిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న వారు మరణిస్తే రూ. 5లక్షలు ఇస్తున్నారు. పెరిగిన ఖర్చులకు వారి కుటుంబాలను పోషించాలంటే ఆ డబ్బులు సరిపోవడం లేదు. మాలాంటి వారు గీత వృత్తిని వదిలేసి పెట్రోల్ బంక్‌లు, హోటళ్లల్లో పని చేస్తున్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెలిస్తే ఆ కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతుంది.

- వంగ రమేష్, గీత కార్మికుడు, రత్నగిరి

ఎక్స్ గ్రేషియా కోసం ఎదురు చూపు



నా భర్త కొక్కిస రాజు తాటి చెట్టుపై నుంచి పడి గత నెల రోజుల క్రితం మరణించాడు. నా భర్త తెచ్చే డబ్బులతోనే మా కుటుంబం గడిచేది. నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వారిని చదివించాలన్న నాకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ప్రభుత్వం నాలాంటి వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలి. మాకు ఎలాంటి స్థిరచరాస్తులు లేవు.

- కొక్కిస స్వప్న, మరణించిన గీత కార్మికుడి భార్య, గట్లనర్సింగాపూర్

కాళేశ్వరం అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టి

- మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ప్రణాళికలు
- గోదావరి పుష్కరాలకు రూ.150కోట్ల ప్రతిపాదనలు
- కాశీ, శ్రీశైలం తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు



కాళేశ్వరం ఆలయంలోని లింగాలు

మహదేవపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో కాశీ, శ్రీశైలం క్షేత్రాలకు దీటుగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మే 15వతేదీ నుంచి ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాలకు రూ.25కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు కనీవినీ ఎరుగని రీతిలో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వీఐపీ ఘాట్ నుంచి మెయిన్ ఘాట్ వరకు కిలోమీటరు మేర పుష్కరఘాట్‌ను నిర్మించనుంది. దీంతో పాటు కాళేశ్వరం నలువైపులా రోడ్ల విస్తరణ, కాటేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.150కోట్లు వెచ్చించినట్టు తెలుస్తోంది. ఏపీలోని రాజమండ్రి పుష్కరఘాట్‌ను మరిపించేలా కాళేశ్వర శైవక్షేత్రాన్ని ఆకర్షణీయంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబుతో పాటు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. నిధులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణలో గోదావరి నది 700 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండగా అందులో కాళేశ్వర శైవక్షేత్రం అత్యంత ప్రసిద్ధిగాంచింది. త్రివేణి సంగమ క్షేత్రంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ఈ ప్రముఖ క్షేత్రాన్ని గోదావరి పుష్కరాల సందర్భంగా కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. వారికి ఎలాంటి ఎలంటి అసౌకర్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో కీలక మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు తన సొంత నియోజకర్గంలోని కాళేశ్వరాన్ని భారీ అంచనాలతో ఆధ్యాత్మిక క్షేత్రంతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. దీంతో కాళేశ్వరాలయానికి మహర్దశ రానుంది.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు ఎంపీ కావ్య విజ్ఞప్తి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్ పోర్టు పనులను వేగవంతం చేయాలని, వీలైనంత త్వరగా పెద్ద విమానాలు నడిచేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు అభివృద్ధికి ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులను, ఉయిర్‌క్రాఫ్ట్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని అన్నారు. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలను, పెద్ద విమానాలను నడిపేందుకు కార్యాచరణను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు, భూసేకరణ అనంతరం విమాన రాకపోకలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.



ఎల్కతుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు

రజతోత్సవ సభతో రాజకీయాల్లో పెను మార్పులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో సభ నిర్వహణ పనుల ప్రారంభం
- హాజరైన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభతో రాజకీయాల్లో పెను మార్పులు జరుగునున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాటు సభాస్థలి పనులకు మంత్రితో పాటు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సభ పర్యవేక్షకుడు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. దేశంలోనే జరగని విధంగా అతి పెద్ద మహాసభ ఎల్కతుర్తిలో జరగబోతోందన్నారు. నాడు కేసీఆర్ పాలనలో ప్రజలు తాగు, సాగునీరు, కరెంట్‌కు ఎలాంటి కష్టం లేకుండా ఉన్నారని, నేడు కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతున్నారని మండిపడ్డారు.కేసీఆర్‌ను ఎందుకు పోగొట్టుకున్నామనే బాధ ప్రజల్లో బలంగా ఉందన్నారు. సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ధ్యేయంగా ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. మూడు జిల్లాలకు ముఖద్వారమైన ఎల్కతుర్తి బీఆర్ఎస్ పండుగకు వేదికైందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధమైన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. 14 యేళ్ల పాటు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థాయికి తీసుకువచ్చారన్నారు. 15 నెలలుగా కాంగ్రెస్ అసమర్థ పాలనపై బీఆర్ఎస్ కొట్లాడుతోందన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన పార్టీ రజతోత్సవ సభను హనుమకొండ జిల్లాపరిధిలోఏర్పాటు చేసుకోవడం సంతోషమన్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభను తన నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో నిర్వహించడం గర్వకారణమని అన్నారు. పార్టీ రజతోత్సవ సభకు కుంభమేళా తరహాలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నట్లు తెలిపారు. సభ నిర్వహణకు భూములు ఇచ్చిన చింతలపల్లి గ్రామ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ప్రజలు తరలిరానున్నట్లు తెలిపారు. 160 ఎకరాల్లో సభ నిర్వహణ, 1600 ఎకరాల్లో పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అభివృద్ధిలో ఓరుగల్లుకు ప్రముఖ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. 27న నిర్వహించే సభను సమర్థవంతంగా పూర్తి చేస్తామన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో జరిగిన ఐదు సభల్లో ఒక సభ గతంలో వరంగల్‌లో జరిగిందన్నారు. దాన్ని మించిన సభ మరోసారి ఎల్కతుర్తిలో జరగనుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, వాసుదేవ రెడ్డి, సతీష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కు మార్, మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు వొడితెల ఇంద్రనీల్, రాకేష్‌రెడ్డి, కడారిరాజు, రవీందర్‌గౌడ్, మేకల స్వప్న, రవీం దర్‌రెడ్డి, నగేష్, మహేందర్, చిట్టి, కోరె రాజ్‌కు మార్, వీరలింగం, మహేందర్, మదన్‌మోహన్ రావు, శ్రీనివాస్, స్వామి, వెంకటేష్‌యాదవ్, దుకిరే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేతన.. వెతలు!

ఏడాదిగా జీతాల్లేక ధరణి ఆపరేటర్ల పస్తులు





- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపు ప్రతిపాదన
- ఆదేశాలు రాక వేతనాలు ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 78మంది ఆపరేటర్లు.. రూ.కోటికి పైగా బకాయి
- బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంగా వేతనాలు ధరణి ఆపరేటర్లు వెతలు పడుతున్నారు. జీతాల కోసం ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి గోడు వెళ్లబోసుకుని వినతి పత్రాలను సమర్పించినా.. చివరికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా.. త్వరలోనే చెల్లిస్తామన్న మాటే తప్ప ఇప్పటి వరకు జీతాలు మాత్రం అందలేదు. నాలుగు నెలల వేతనాలకు సంబంధించి బిల్లులు తయారయ్యాని చెబుతున్నారు కానీ వాటి విషయమై కూడా స్పష్టత లేదు. ఏడాదిగా వేతనాలు రాక ధరణి ఆపరేటర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబాలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని ఆపరేట్లు దిగాలు చెందుతున్నారు.

టీజీటీఎస్‌కు అటాచ్

గతంలో టెరాసిస్ అనే తర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ధరణి ఆపరేటర్లకు వేతనాలు అందేవి. గత సంవత్సరం జనవరిలో ఆ ఏజెన్సీ కాంట్రాక్టు కాలం ముగిసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఏజెన్సీ గడువును పెంచకుండా పక్కనబెట్టింది, ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా పని చేస్తున్న ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్ (టీజీటీఎస్)కు ఆటాచ్ చేసింది. ఇక నుంచి దీని ద్వారానే వేతనాలు చెల్లించనున్నట్లు తెలిపింది. ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్న వారి వివరాలను దానికి అందజేసింది. గతేడాది ఫిబ్రవరి నుంచి టీజీటీఎస్ ద్వారా తమకు వేతనాలు వస్తాయని ఆశ పడిన ఆపరేటర్లకు చివరికి ఎదురుచూపులే మిగిలాయి. ఇదిగో ఇస్తాం... అదిగో ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదు. దీంతో ధరణి ఆపరేటర్ల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలక చందంగా మారింది. థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఉన్నప్పుడు నెలనెలా వేతనాలు వచ్చేవి. ఇప్పుడు రాకపోగా ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అసలు తాము ఉన్నట్టా? లేనట్టా అన్న సందే హంలో ఆపరేటర్లు కొట్టుమిట్టాడుతు న్నారు. మొదట్లో వీరిని తొలగించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినా తర్వాత మనసు మార్చుకుని.. కొత్తవారిని నియ మించే బదులు వారినే కొనసాగించాలన్న నిర్ణయానికి వచ్చింది. థర్డ్ పార్టీ ఏజెన్సీ నుంచి నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని టీజీటీఎస్‌కు తమను అటాచ్ చేయడంతో ధరణి ఆపరేటర్లు ఒకింత సంతోషించారు. భవిష్యత్తులో తమ సర్వీస్ రెగ్యులర్ అవుతుందని ఆశపడ్డారు. వేతనాలు కూడా పెరుగుతాయను కున్నారు. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. అసలు వేత నాలే రావడం నిలిచిపోయింది. ఏం చేయాలో తెలియని అనిశ్చి త పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. వేతనాల గురించి ప్రభుత్వాన్ని గట్టిగా అడిగేట్టు కూడా లేదు. ఒత్తిడి తెస్తే సర్కార్ కు ఎక్కడ కోపమొచ్చి ఉన్న ఉద్యోగం ఎక్కడ ఊడుతుందోనని భయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 78 మంది:

ప్రతీ మండలానికి ఒక ఆపరేటర్ చొప్పున ఉమ్మడి జిల్లాలో 78 ధరణి ఆపరేటర్లు ఉన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కోఆర్డినేటర్ హోదాలో ఒక్కో ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కలెక్టరేట్లలో కోఆర్డినేటర్‌తో పాటు అయనకు సహాకులుగా ఇద్దరేసి ఆపరేటర్లు (బఫర్స్) ఉండేవారు. ఇప్పుడు వారు కూడా లేరు. ధరణి ఆపరేటర్లకు ఇచ్చే వేతనం కూడా చాలా తక్కువ. వారికి ప్రస్తుతం నెలకు రూ. 11,500 చొప్పున చెల్లిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల క్రితం వీరి నియామకం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 675 మంది ప్రస్తుతం పని చేస్తున్నారు. మొదట్లో వీరికి రూ.10వేల చొప్పున చెల్లించేది. ధరణి కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమితులైనవారిలో అత్యధికులు ఇంజనీరింగ్ పట్టభద్రులే. అయినప్పటికీ ప్రభుత్వం భవిష్యత్తులో వేతనాలు పెంచుతుందనే ఆశతో విధులో చేరారు. ఏడాదిగా వేతనాలు రాకపోవడంతో కొంతరు ఆపరేటర్లు మరో దారి లేక పీఎఫ్ డబ్బు డ్రా చేసుకోని జీవితాలను వెళ్లదీస్తున్నారు.

ఆరేళ్ల క్రితం..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అన్ని మండలాల్లో తహసీల్దార్లకు, సంయుక్త సబ్ రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలను అప్పగించి, వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల విధులు కూడా వారికే కేటాయించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేసి పరికరాలను సమకూర్చి ఆపరేటర్లను నియమించింది. అప్పటి నుంచి తర్డ్ పార్టీ ఎజెన్సీ ద్వారా వీరు పని చేస్తున్నారు.

వెట్టిచాకిరీ

చాకిరి బారెడు, జీతం బెత్తెడు అన్న చందంగా ఉంది ధరణి ఆపరేటర్ల పరిస్థితి. వీరు ధరణి పోర్టల్‌ను ఆపరేట్ చేయడమే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను, ఎన్నికలు, సర్వే వివరాలు ఇతరత్రా సర్వే డాటా నమోదు తదితర పనులను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నవీరు అవసరమైతే రాత్రి పొద్దుపోయే వరకు కూడా పని చేయాల్సివస్తోంది. పైగా మండలానికి ఒక్క ఆపరేటరే ఉండడంతో అత్యవసర పని ఉన్నప్పుడు, లేదా అనారోగ్యానికి లోనైప్పుడు సెలవు పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక మండలం ఆపరేటర్ సెలవు పెడితే పక్క మండలం ఆపరేటర్ ఆయన విధులు నిర్వహించాల్సి వస్తోంది.

రూ.1.07కోట్ల బకాయిలు

ఒక్కో ఆపరేటర్‌కు రూ.1,38,000 వేతన బకాయిలు రావలసి ఉంది. మొత్తంగా 78 మంది ఆపరేటర్లకు రూ. 1,07,64,000 మేర బకాయి ఉంది. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ఏడాదిపాటు వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ధరణి ఆపరేటర్లు వాపోతున్నారు. ప్రతీ నెల వేతనాలను అందించాలని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాము. గత్యంతరం లేక బయట, ఇతరుల వద్ద అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. 2021 జూన్‌లో వచ్చిన జీవో-63 ప్రకారం తమ వేతనాలు రూ. 31,040కు పెంచాలని కోరుతున్నారు. మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నారు.

వరంగల్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్

జారీ అయిన సర్టిఫికెట్



చపాట మిర్చికి జారీ అయిన జీఐ ట్యాగ్ సర్టిఫికెట్

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ సర్టిఫికెట్ జారీ అయింది. నాలుగేళ్ల కిందట ఈ మేరకు చేసిన కృషికి ఇప్పుడు ఫలితం దక్కింది. వరంగల్ జిల్ల దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలోని తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేర కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఈ సర్టిఫికెట్‌ను అందచేసింది. నర్సంపేట ప్రాంతంలో పండుతున్న చపాట మిర్చికి జీఐ ట్యాగ్ లభించడంతో ప్రపంచస్థాయి గుర్తింపు లభించినట్లయింది. జీఐ గుర్తింపు వల్ల భవిష్యత్తులో చపాట మిర్చికి మంచిధర లభించడమే కాక అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునే అవకాశం కూడా లభిస్తుంది. నాలుగేళ్ల కిందట నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన చపాట మిర్చి ఎఫ్‌పీవోలు ఈ జీఐ ట్యాగ్‌తో సత్ఫలితాన్ని అందుకోగలిగాయి. అంతేకాకుండా వాటికి అంతర్జాతీయ గౌరవం కూడా దక్కింది. చపాట మిర్చికి జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ లభించినందుకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చపాట మిర్చి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా చేసిన కృషి నేడు గొప్ప ఫలితాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ లభించడానికి కృషిచేసిన అప్పటి వ్యవసాయాధికారులకు, ఎఫ్‌పీవో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జీఐ ట్యాగ్ వల్ల ఒనగూరే సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ధనసరి అనసూయ సీతక్క

గోవిందరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేషన్‌షాపుల ద్వారా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని చల్వాయిలో గ్రామం లో ఆమె నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి నిరుపేద కుటుంబం కుడుపునిండా సన్నబియ్యంతో భోజనం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీఎస్‌వో షాఫైజల్ హుస్సేని, డీఎం డీసీఎస్‌వో రాంపతి, తహసీల్దార్ సృజన్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, పలు వ్యాపారాలు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలో బుధవారం జరిగిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.250కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళాల సంఘాలకు అందించామని, 30ఏళ్లక్రితం రూ.10ల పొదుపుతో ఏర్పడిన స్వయం సహాయక సంఘాలు నేడు క్రమశిక్షణతో మెలుగుతూ కోట్లాది రూపాయలను పొదుపు చేసుకుని అవసరాల కోసం వాడుకుంటున్నాయని అన్నారు. పది మందికి ఉపాధి కల్పన కోసం తీసుకున్న రుణాలకు ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తోందని అన్నారు. ఆర్థిక స్వావలంబన కోసమే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. వడ్డీలేని రుణాలను అందించడంతోపాటు ఇంది రమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మహిళల పేరుపై అందిస్తున్నట్టు పేర్కొన్నారు.



చల్వాయిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ఇంట్లోని ప్రతి మహిళ చేతిలో రూ.10 ఉంటే ఆ కుటుంబానికి ఎంతోగానో దోహదపడతాయని, గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా మారడంతో రామప్ప, లక్నవరం, బొగత జలపాతం, సమ్మక్క-సారలమ్మ జాతర, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి వంటి ప్రాంతాల్లో మహిళలు పలు రకాల వ్యాపారాలు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తుందని అన్నారు. మహిళలంతా ఒకేజాతి అని, 15 సంవత్సరాలు నిండిన యువతులను సంఘాలలో చేర్పించిన పక్షంలో వారు సైతం ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ మహిళ సైతం కన్నీరు పెట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడిలా మహిళలకు చేయూత అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కోరారు. అనంతరం మంత్రి సీతక్క మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, సెర్ప్ సీఈవో దివ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేసిన మంత్రి సీతక్క

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పేదలకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబం కడుపునిండా సన్నబియ్యంతో భోజనం చేయడమే లక్ష్యంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీఎస్‌వో షాఫైజల్ హుస్సేని, డీఎం డీసీవో రాంపతి, తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీవో రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం



గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించగా మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఆమె అన్నారు. అందులో భాగంగానే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గొత్తికోయలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పిల్లల చదువు, రోడ్డు, కరెంట్ సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పోడుభూముల పట్టాలు, ఇంటి పట్టాలు తదితర సమస్యలను గొత్తికోయలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 15రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, వెంటనే సమీప అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం అందిస్తామని అన్నారు. త్వరలోనే భారీ సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు కుల సర్టిఫికెట్స్ కోసం అధికారులతో మాట్లాడుతానన్నారు. విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. అలాగే తాడ్వాయి మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి సీతక్క సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ దివాకర, తహసీల్దార్ సురేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, ఎఫ్‌డీవో రమేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

వెంకటాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరగ్గా ఆయన మాట్లాడారు. పెసా నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల నిర్వహించిన వీరభద్రవరం గ్రామసభను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన అధికారు లను సస్పెండ్ చేయాలన్నారు. ఈసమావేశంలో నాయకులు తుర్స కృష్ణబాబు, సందీప్, తాటి రాంబాబు, సమ్మయ్య, గోపి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి అన్నారు. సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా ములుగులోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ సిబ్బందితో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెట్టింగ్ యాప్స్, ఐపీఎల్ క్రికెట్ వంటి సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 1930ని సంప్రదించాలన్నారు. ఈ సదస్సులో ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐలు స్వామి, తిరుపతి, వెంకటనారాయణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ఉమామహేశ్వర్, తేజస్వి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

గోవిందరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, దుంపెల్లిగూడెం ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన వైద్యులు, సిబ్బంది, వ్యాక్సిన్ నిల్వలు, టెంపరేచర్ రిజిష్టర్లు, ఐస్ ప్యాక్స్, వ్యాక్సిన్ వీవీఎంలను పరిశీలించి డ్యూలిస్టు ప్రకారం వ్యాక్సిన్‌ను ఉప కేంద్రాలకు పంపిణీ చేయాలని ఫార్మసిస్టుకు సూచించారు. దుంపెల్లిగూడెం ఉపకేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. సమయానుగుణంగా పిల్లలకు టీకాలు ఇవ్వాలని, డ్యూలిస్టు ప్రకారం వ్యాక్సిన్ ఇచ్చే పిల్లల తల్లిదండ్రులకు టీకా ప్రాముఖ్యతను, టీకాలు ఇచ్చే కేంద్రం వివరాలను ఒకరోజు ముందుగానే తెలియజేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమయపాలన పాటించడంతోపాటు వైద్యం కోసం వచ్చే రోగులను ఆప్యాయతతో పలకరించి నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రస్తుత వేసవిలో ముందస్తుగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమకూర్చుకోవాలని, మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ ప్రాంతాల వివరాలు తెలుసుకుని సిబ్బంది ఆప్రాంతాలకు వెళ్లి కూలీ లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. అనంతరం జిల్లాలోని వైద్యులు, హెల్త్ ప్రొవైడర్లు, పర్యవేక్షకులతో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు జూమ్ మీటింగ్ నిర్వహించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చంద్రకాంత్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకోవాలి

తాడ్వాయి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువకులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాల యంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఎంబీసీ, ఈబీసీ అర్హులైన నిరుద్యోగ యువకులు కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఈ నెల 14 వరకు గడువు ఉందని, నిరుద్యోగులు ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీవో శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

మనోజ్‌రెడ్డిని అభినందించిన బీజేపీ నాయకులు



మనోజ్‌రెడ్డిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గోవిందరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 394వ ర్యాంకు సాధించిన మండలంలోని పస్రా గ్రామానికి చెందిన ఏనుగు వాసవి-రవీందర్‌రెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంతోపాటు మరికొందరు నాయకులు బుధవారం అభినందించారు. మనోజ్‌రెడ్డితోపాటు అతడి తల్లిదండ్రులను బలరాం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్, నాయకులు తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, భూక్య జవహర్‌లాల్, కొత్త సురేందర్, శీలమంతుల రవీంద్రచారి, జినుకల కృష్ణాకర్‌రావు, కొత్త సుధాకర్‌రెడ్డి, కర్ర సాంబశివరెడ్డి, పసుల బాబూరావు, మేరుగు సత్యనారాయణ, ఏదునూరి రమేష్, యార్లగడ్డ నాగేశ్వర్‌రావు, వంగాల సోమిరెడ్డి, ఆకుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపులోకి తీసుకొస్తున్న ఫైర్, అటవీశాఖ అధికారులు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ఫారెస్టు డివిజన్ కార్యాలయంలోని టింబర్ డిపోలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. సమీప అడవి నుంచి వ్యాపించిన కార్చిచ్చు వేగం గా వ్యాపిస్తూ పక్కనే ఉన్న టింబర్ డిపోకు అంటుకుంది. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి డిపోలో ఉన్న కోట్లాదిరూపాయల విలువచేసే టేకు, జిట్రేగి తదితర కలపను కాపాడారు.

ఇటీవల తాడ్వాయి అడవుల్లో ధ్వంసమైన వృక్షాలను తీసుకొచ్చి టింబర్ డిపోకు ఆనుకుని విలువైన కలపను నిల్వ చేశారు. డిపోను ఆనుకునే దట్టమైన అడవి ఉంటుంది. బుధవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో అడవికి కార్చిచ్చు అంటుకుంది. కార్చిచ్చు ద్వారా భారీ ఎత్తున మంటలు చెలరేగుతూ సమీపంలోని టింబర్ డిపోకు వ్యాపించాయి. దీంతో సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మంటలు ఆర్పుతూనే ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి రెండు ఫైరింజన్లను తీసుకొచ్చి ఎగసిపడుతున్న మంటలను అదుపులోకి తెచ్చారు. టింబర్ డిపోలో ఉన్న కలప ఈ అగ్నిప్రమాదంలో కొంత మేర స్వల్పంగా కాలిపోగా అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ నష్టం నుంచి బయటపడ్డారు. ఈవిషయంపై ఎఫ్‌డీవో రమేష్‌ను వివరణ కోరగా మంటలు అదుపులోకి వచ్చాయని, ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని తెలిపారు.

మారుమూల ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లో దివంగత నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు కొనియాడారు. అంబట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయ కుడు ఎరవెల్లి విలాస్‌రావు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ బుధవారం ముగిసింది. విజేతలకు శ్రీనుబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈటోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొనగా దమ్మూర్ టీంకు మొదటి బహుమతి, అంబట్‌పల్లి టీంకు ద్వితీయ, బొడాయిగూడెం టీంకు తృతీయ బహుమతి, ఎన్కపల్లి టీంకు నాలుగో బహుమతులను కైవసం చేసుకున్నారు. గెలుపొందిన నాలుగు జట్లకు నగదుతో పాటు ట్రోఫీ, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కోట రాజబాబు, కట్కం అశోక్, చీమల సందీప్, అంగోతు సుగుణ, దండేర రాజేందర్, గుడాల శ్రీనివాస్, ఐదు మండలాల యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్మెంట్ సహజం : ఎస్పీ



రిటైర్ ఎస్సైను, ఆయన సతీమణిని సన్మానిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్సై పొరిక లాల్‌సింగ్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసిన లాల్‌సింగ్ ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, లాల్‌సింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ



బాధితురాలికి సరుకులు అందిస్తున్న పుట్ట మధు, బీఆర్ఎస్ నేతలు

కాటారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను కలిశారు. దేవరాంపల్లిలో ఇటీవల మృతి చెందిన బండి మధునయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన జిముడ దుర్గమ్మ కుటుంబాన్ని పరామర్శించి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు అందించారు. పరికిపల్లిలో శస్త్రచికిత్స చేసుకున్న కొలుగూరి సమ్మయ్య, ఆదివారంపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న రత్న రమేష్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు శ్రీలక్ష్మీచౌదరి బండం రాజమణి, గాలి సడవలి, జాడి శ్రీశైలం, దుర్గారావు, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఏజీఎంగా పదోన్నతి పొందిన డీజీఎం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో డిస్ట్రిక్ట్ జనరల్ మేనేజర్ (డీడీఎం)గా పనిచేస్తున్న కవీంద్ర.. అడిషనల్ జనరల్ మేనేజర్(ఏజీఎం)గా పదోన్నతి పొందారు. ఈ మేరకు సింగరేణి సంస్థ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన్ను భూపాలపల్లి కోల్‌మైన్స్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇన్‌చార్జి కోల నాగేంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు వివిధ విభాగాల సింగరేణి అధికారులు సైతం కవీంద్రకు కాంగ్రాట్స్ చెప్పారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే గండ్ర



చెల్పూరులో పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు తదితరులు

గణపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికే రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మండలంలోని చెల్పూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు బుధవారం చేపట్టిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేశారు. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు చల్లూరి మధు, రాజేందర్, సత్యనారాయణరెడ్డి, కావటి రవి, కొత్త వెంకన్న, చోటేమియా, మలహల్‌రావు, భువనసుందర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి): మహనీయులు గాంధీ, అంబేద్కర్‌తోపాటు రాజ్యాంగాన్ని గౌరవించుకోవడమనే మూడు సూత్రాలపై గ్రామాల్లో నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం నుంచి మండల వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ నెల 3న చింతకాని, ఇబ్రహీంపల్లి, బయ్యారం, 4న కొత్తపల్లి, మేడిపల్లి, అంకుసాపూర్, 5న చిద్నెపల్లి, ప్రతాపగిరి, నస్తూరుపల్లి, 9న కాటారం, గారెపల్లి, మద్దులపల్లి, 10న ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి, ఒడిపిలవంచ, 11న వీరాపూర్, గూడూరు, గుండ్రాత్‌పల్లి, 12న దామెరకుంట, విలాసాగర్, గంగారం, 13న దేవరాంపల్లి, శంకరంపల్లి, ధన్వాడ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు వివరించారు.

సర్వాయి పాపన్న వర్ధంతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బుధవారం నిర్వహించారు. మండల గౌడ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి నరేందర్, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

- భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న బహుజన నాయకుడని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతి కొనియాడారు. జిల్లా కేంద్రంలో పాపన్న వర్ధంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించగా రాష్ట్ర కమిటీ సభ్యుడు సంగీ రవి, జిల్లా ఇన్‌చార్జి వేల్పుగొండ మహేందర్, నాయకులు ఓంకార్, రాజ్‌కుమార్, కుమార స్వామి, సునీల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు చీటూరి రాజలింగుగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగా సంఘం నాయకులు మారగోని రాజబాపు, మార్క రవీందర్, చీటూరి మల్లయ్య, చీకట్ల స్వామి, మారగోని తిరుపతి, బొడిగె రాజేర్, గణపతి, శంకర్, వెంకన్న, నాగయ్య, మహేష్, కిరణ్, శ్రవణ్, శ్రీకాంత్, శివ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.
- గణపురం (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని మండల కేంద్రంలో గౌడ కులస్థులు నిర్వహించారు. మండల కేంద్రలోని గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మాదాసు రవి, నారగాని దేవేందర్, శివశంకర్, సమ్మయ్య, తిరుపతి, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మాదారం కార్యదర్శిపై ఎంపీడీవోకు ఫిర్యాదు

మహాముత్తారం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదారం గ్రామ కార్యదర్శి జోడె కృష్ణవేణిపై ఎంపీడీవో శ్రీనివాసరావుకు సర్వ రాజు అనే రైతు బుధవారం ఫిర్యాదు చేశాడు. మాదారం గ్రామ పరిధిలోని మామిడికుంటలో చేపల పంపకానికి వేలం వేయొద్దని రైతులు కోరడంతో మత్స్యశాఖ అధికారులు కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారని తెలిపాడు. వాటిని పట్టించుకోకుండా చెరువులో చేపల పంపకం కోసం కార్యదర్శి వేలం వేశారని పేర్కొన్నాడు. చెరువులో చేపలు వేసుకొన్న వ్యక్తులు వాటిని పట్టడంతో నీళ్లు బురదగా మారి తూముకు వెళ్లడం లేదని తెలిపారు. దీంతో తనతోపాటు పది మంది రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కార్యదర్శి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్య

కాటారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వ్యవసాయ కూలీ ఒకరు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెరకుంట గ్రామానికి చెందిన బొరెం దుర్గయ్య(50), సాలమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుమా ర్తెకు పెళ్లి చేశారు. చిన్న కూతురు ఇంటర్ చదువుతోంది. దుర్గయ్య దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన దుర్గయ్య సరిగా పనులకు వెళ్లడం లేదు. 13రోజుల క్రితం పనికి వెళ్లి గట్టుపై నుంచి కిందపడ్డ సాలమ్మకు చేయి విరిగింది. దీంతో ఆమె చికిత్స చేయించుకుని ఇంటి వద్దే ఉంటోంది. దుర్గయ్య సైతం పనులకు వెళ్లడం లేదు. మద్యం తాగుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో భర్తను సాలమ్మ మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన దుర్గయ్య క్షణికావేశంతో మద్యం మత్తులో మంగళవారం ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్‌రెడ్డి, గౌడసంఘం నాయ కులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ముంజాల భిక్షపతి, కూనూరు అశోక్‌గౌడ్, మునిపల్లి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుపెట్టొద్దు..

రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య వైరుధ్యాలు సృష్టించొద్దని రాష్ట్రమంత్రి సీతక్క అన్నారు. జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మల్లంపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలు క్షమించరన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, బీసీ గణన బిల్లులకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచంద్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

మంగపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని కమలాపురం ఒరిస్సాకాలనీలో బుధవారం జరిగింది. అంబేద్కర్ కాలనీకి చెందిన యాసం వెంకటమ్మకు చెందిన పాడి ఆవును సమీప అడవిలోకి పంపించారు. మందలో నుంచి అది తప్పిపోయి కమలాపురం ఒరిస్సాకాలనీ వైపు మేత కోసం వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలా డుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 25వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. బాధితురాలిని ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేషన్‌షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి రేషన్‌షాపులో భారత ప్రధాని మోదీ ఫొటోను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు బుధవారం ములుగు మండలంలోని బండారుపల్లి రేషన్ షాపును పరిశీలించారు. నాగరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన జాతీయ పంపిణీ పథకం ద్వారా కేంద్రంబియ్యాన్ని ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని అన్నారు.